# అసఫ్‌జాహీ వంశం

క్రీ.శ. 1687లో ఔరంగజేబు గోల్కొండ రాజ్యాన్ని జయించి మొగల్ సామ్రాజ్యంలో విలీనం చేశాడు. నాటి నుంచి ఆంధ్ర దేశం 37 ఏళ్ల పాటు మొగలుల ప్రత్యక్ష పాలనలోనే కొనసాగింది. 1724లో నిజాం ఉల్ ముల్క్ హైదరాబాద్‌ను రాజధానిగా చేసుకుని దక్కన్ పాలకునిగా ఉండటానికి మొగల్ చక్రవర్తి మహ్మద్ షా అనుమతి సంపాదించాడు. ఆనాటి నుంచి దక్కన్‌లో అసఫ్‌జాహీల పాలన ప్రారంభమైంది. ఈ అసఫ్‌జాహీ వంశ పాలన 1948, సెప్టెంబర్ 17న నిజాం రాజ్య విలీనమయ్యేంత వరకు 224 ఏళ్ల పాటు సాగింది.

అసఫ్‌జాహీ వంశంలో 9 మంది రాజులు పరిపాలించారు.

1) అసఫ్‌జా నిజాం ఉల్ ముల్క్ (క్రీ.శ.1724–1748)
2) నాసర్‌జంగ్ (క్రీ.శ.1748–1751)
3) సలాబత్ జంగ్ (క్రీ.శ.1751–1761)
4) నిజాం అలీఖాన్ (క్రీ.శ.1761–1803)
5) సికిందర్ జా (క్రీ.శ.1803–1829)
6) నాసిరుద్దౌలా (క్రీ.శ.1829–1857)
7) అఫ్జలుద్దౌలా (క్రీ.శ.1857–1869)
8) మహబూబ్ ఆలీఖాన్ (క్రీ.శ.1869–1911)
9) ఉస్మాన్ ఆలీఖాన్ (క్రీ.శ.1911–1948)

నిజాం పాలకులు 1758 వరకు మొగల్ సుబేదారులుగానే ఉండేవారు. నాణేలు కూడా మొగల్ చక్రవర్తుల పేరుతోనే ముద్రించారు. 'నిజాం' అనే పేరు ఆలీఖాన్ కాలం నుంచి స్థిరపడింది. నాటి భారతదేశపు 560 సంస్థానాలన్నింటిలోకి నిజాం రాజ్యం పెద్దది. స్వదేశ రాజులలో ప్రథమ హోదాను అనుభవించింది నిజాం రాజే.

**అసఫ్ నిజాం ఉల్ ముల్క్ :**

అసఫ్ జాహీ వంశ స్థాపకుడు. 24 ఏళ్లు పరిపాలించాడు. ఈయన అసలు పేరు మీర్ ఖుమ్రీద్దున్ ఖాన్. సర్కార్ పాలకునిగా ఈయన ప్రదర్శించిన శక్తిసామర్థ్యాలకు మెచ్చిన ఔరంగజేబు 'చిన్ కిలిచ్‌ఖాన్' అనే బిరుదును ప్రధానం చేశాడు. ఈయన పూర్వీకులు ఉర్కీ దేశస్థులు. అసఫ్‌జా అనేది కూడా ఈయనకు మొగల్ చక్రవర్తి మహ్మద్ షా ఇచ్చిన బిరుదే. 1728లో దక్కన్‌లో మహారాష్ట్రుల విస్తరణను అరికట్టడానికి నిజాం ఉల్ ముల్క్ వారిపై దాడి చేశాడు. అయితే ఈ యుద్ధంలో మహారాష్ట్ర పాలకుడైన ఛత్రపతి సాహు పాల్ఖేట్ చేతిలో నిజాం ఓటమి చెందాడు. ఈ సందర్భంగా 'మున్షిప్ గాంవ్' సంధి జరిగింది. దీని ప్రకారం– చౌత్, సర్దేశ్‌ముఖి అనే రెండు పన్నుల్ని నిజాం చెల్లించాల్సి వచ్చింది.

**నాసర్‌జంగ్ :**

నిజాం ఉల్ ముల్క్ రెండో కుమారుడు ఇతను. ఈయన పాలనకాలం మూడేళ్లే. 'నిజాం ఉద్దౌలా' అనేది ఇతని బిరుదు. ఇతని మేనల్లుడు పేరు ముజఫర్ జంగ్. దక్కన్‌కు తానే నిజమైన రాజప్రతినిధిని అంటూ ఫ్రెంచి గవర్నర్ డూప్లే సహాయంతో నాసర్‌జంగ్‌పై దాడి చేశాడు. అయితే, ఈ దాడిని సమర్థవంతంగా ఎదుర్కొన్న నాసర్‌జంగ్, ముజఫర్‌జంగ్‌ను బందీ చేసినప్పటికీ, డూప్లే కుట్ర కారణంగా కర్నూలు నవాబు హిమ్మత్‌ఖాన్‌చే హత్యకు గురయ్యాడు.

ఈ హత్య తర్వాత డూప్లే, ముజఫర్‌జంగ్‌ను బంధ విముక్తున్ని చేసి దక్కన్ సుబేదారుగా నియమించాడు. అయితే, 1751 ఫిబ్రవరిలో కడప, కర్నూలు, నవనూరు నవాబులు కుట్ర పన్ని కడపకు దక్షిణంగా 35 మైళ్ల దూరంలో ఉన్న లక్కిరెడ్డిపల్లి (రాయచోటి) వద్ద ముజఫర్ జంగ్‌ను హత్య చేశారు.

**సలాబత్‌జంగ్ :**

ముజఫర్ జంగ్ హత్య తర్వాత సలాబత్ జంగ్‌ను ఫ్రెంచి సేనాని బుస్సీ సుబేదారుగా ప్రకటించాడు. ఈయన పదేళ్లు పాలించాడు. నాసర్‌జంగ్ తమ్ముడే సలాబత్‌సింగ్. 1754లో ఉత్తర సర్కారైన శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, ముస్తఫానగరం (కొండపల్లి), ఏలూరులను సొంత జాగీరుగా పేర్కొంటూ సలాబత్‌జంగ్ నుంచి ఫ్రెంచివారు ఒప్పందాన్ని రాయించుకున్నారు. ఈ సమయంలో జరిగిన మూడో కర్ణాటక యుద్ధంలో ఆంగ్లేయులు ఫ్రెంచి వారిని ఓడించి మచిలీపట్నాన్ని స్వాధీనం చేసుకున్నారు.

1759, మే 14న సలాబత్‌జంగ్ ఆంగ్లేయులతో సంధి చేసుకుని గుంటూరు తప్ప ఉత్తర సర్కారులన్నింటినీ ఆంగ్లేయుల పరం చేశాడు. ఈ దశంలో 1861లో మొదటి అసఫ్‌జా నాలుగో కుమారుడైన నిజాం ఆలీఖాన్ రెండో అసఫ్‌జా బిరుదుతో నిజాం అయ్యాడు.

**నిజాం అలీఖాన్ :**

సుదీర్ఘంగా 42 ఏళ్లు పరిపాలించాడు. ఈయన కాలం నుంచే అసఫ్ జాహీ ప్రభువులు నిజాం ప్రభువులుగా ప్రసిద్ధి చెందారు. బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ నిజాం పాలకులపై పట్టు సాధించింది. దరిమిలా ఉత్తర సర్కారులు, దత్త మండలాలైన కడప, కర్నూలు, అనంతపురం, బళ్లారి జిల్లాలు బ్రిటీష్‌వారి వశమయ్యాయి. కార్న్ వాలీస్ కాలంలో 1787, సెప్టెంబర్ 18న గుంటూరు సర్కారును నిజాం అలీఖాన్ ఆంగ్లేయులకు అప్పగించాడు.

1796లో మహారాష్ట్రులతో ఖుర్దా వద్ద జరిగిన యుద్ధంలో నిజాంకు బ్రిటీష్ సైన్యం సహకారం అందించలేదు. దీంతో నిజాం ఓటమి పాలయ్యాడు. ఫలితంగా ఆంగ్లేయ పటాలాలను తొలగించి నిజాం–ఫ్రెంచి సేనాని అయిన రేమండ్ సాయంతో తన సైన్యాన్ని పటిష్టం చేసుకున్నాడు. రేమండ్ నెలకొల్పిన తుపాకుల కర్మాగారం అవశేషాలు నేటికీ హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రీలో కనిపిస్తాయి. హైదరాబాద్‌లోని మల

SAKSHI

కోపేటలోని రేమండ్ సమాధి దగ్గర ఉంది. ఇప్పటికీ ఇక్కడ ప్రతియేటా ఉత్సవం జరుగుతుంది. 'ముసారాం' అనేది రేమండ్‌కు గల మరో పేరు.

1800లో గవర్నర్ జనరల్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకారపద్ధతికి అంగీకారం తెలిపిన తొలి స్వదేశీ రాజు నిజాం అలీఖాన్. బ్రిటీష్ సైన్యానికి అయ్యే ఖర్చుల నిమిత్తం దత్తమండలాల్ని నిజాం బ్రిటీష్ వారి పరం చేశాడు. 1770లోనే నిజాం అలీఖాన్ తన రాజధానిని ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్‌కు మార్చాడు. మోతీ మహల్, గుల్షన్ మహల్, రోషన్ బంగ్లా వంటి ప్రసిద్ధ భవనాల నిర్మాణం జరిగింది ఇతని హయాంలోనే.

**సికిందర్ జా :**

నిజాం అలీఖాన్ కుమారుడు. 26 ఏళ్ల పాటు పాలించాడు. మూడో అసఫ్ జా అనేది ఇతని బిరుదు. ఈయన కాలంలో రెండో మహారాష్ట్ర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో సికిందర్ జా బ్రిటీష్ వారికి తోడ్పడి చౌత్ పన్ను నుంచి మినహాయింపు పొందాడు. హైదరాబాద్‌లోని బ్రిటీష్ ప్రతినిధి (రెసిడెంట్) అభీష్టానికి అనుగుణంగా దివాన్‌గా 'మీర్ ఆలం'ను సికిందర్ జా నియమించాల్సి వచ్చింది. హైదరాబాద్‌లోని మీర్ ఆలం చెరువు ఈ దివాన్ పేరుతో నిర్మించినదే.

1811, మార్చిలో హైదరాబాద్‌కు బ్రిటీష్ ప్రతినిధిగా నియమితులైన హెన్రీ రస్సెల్ రాజ్యంలోని శాంతి భద్రతల్ని కాపాడటానికి 'రస్సెల్ దళం' రూపొందించాడు. అనంతర కాలంలో ఈ దళమే హైదరాబాద్ సైన్యంగా ప్రసిద్ధిగాంచింది. అయితే, ఈ రస్సెల్స్ బ్రిగేడుపై ఖర్చు విపరీతంగా పెరిగిపోవడంతో నిజాం ప్రభుత్వం పామర్ అండ్ కంపెనీ దగ్గర అప్పు తీసుకుంది. 1820లో మెట్‌కాఫ్ బ్రిటీష్ ప్రతినిధిగా వచ్చే నాటికి రాజ్య పరిస్థితి మరీ అస్తవ్యస్తమైంది. మెట్‌కాఫ్ సంస్కరణలు తీసుకు వచ్చినా లాభం లేకపోయింది.

సికిందర్ జా పేరు మీదనే సికిందరాబాద్ నగరం ఏర్పడింది.

**నాసిరుద్దౌలా :**

సికిందర్ జా కుమారుడు. 28 ఏళ్లు పాలన సాగించాడు. నాలుగో అసఫ్ జా అనేది ఇతని బిరుదు. ఈయన రాజ్యంలో అస్తవ్యస్థ పరిస్థితుల్ని ఆసరా చేసుకుని అమ్మపాళెం జమీందారు వెంకట నరసింహారావు, చింతగని జమీందారు కాప నరసింహారావు, మునగాల జమీందారు జగన్నాథరావు తిరుగుబాటు చేశారు. ఈ నాసిరుద్దౌలా కాలంలోనే వహాబీ ఉద్యమం, బేరారు దత్తత జరిగాయి.

వహాబీ ఆద్యమం అంటే యూరోపియన్లు, సిక్కులకు వ్యతిరేకంగా వచ్చిన ముస్లిం ఉద్యమం. ఇది 1839 ప్రాంతంలో వచ్చింది. దీని నాయకుడు సయ్యద్ అహమ్మద్ బ్రెయిల్వీ. దీనికి హైదరాబాద్‌లో సికిందర్ జా మూడో కుమారుడైన ముబారిజ్ ఉద్దౌలా నాయకత్వం వహించాడు. సిపాయిల తిరుగుబాటుకు ప్రారంభ సూచిక వంటిది ఈ వహాబీ ఉద్యమం.

1853, మే 21న బ్రిటీష్ కంపెనీతో నిజాం నాసిరుద్దౌలా బేరార్ ఒడంబడిక చేసుకున్నాడు. బ్రిటీష్ వారికి తీర్చాల్సిన అప్పు నిమిత్తం ఈ సంధి జరిగింది. దీని ప్రకారం– బేరార్ రాష్ట్రంతో పాటు దారాశివ్, రాయచూర్ జిల్లాల్ని బ్రిటీష్ కంపెనీకి నిజాం ధారదత్తం చేశాడు. 1853, మే 31న తురాజ్ అలీఖాన్ హైదరాబాద్ దివాన్‌గా ఈ నాసిరుద్దౌలా కాలంలోనే నియమితుడయ్యాడు. 'సాలార్‌జంగ్' అనేది తురాజ్ ఆలీఖాన్ బిరుదు.

**అఫ్జల్ ఉద్దౌలా :**

నాసిరుద్దౌలా కుమారుడు. 12 ఏళ్లు పాలించాడు. ఈయన కాలంలో జరిగిన ప్రధాన సంఘటన 'సిపాయిల తిరుగుబాటు' (1857, మే 10). దీనిలో నిజాం అఫ్జల్ ఉద్దౌలా, ఆయన దివాను మొదటి సాలార్‌జంగ్‌లు బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీకి పూర్తి సహకారం అందించి సిపాయిల తిరుగుబాటు అణచివేతకు దోహదపడ్డారు. బ్రిటీష్ వారు ఈ నిజాంకు 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదు ఇచ్చారు.

**మహబూబ్ ఆలీఖాన్ :**

తన తండ్రి అఫ్జల్ ఉద్దౌలా మరణించినపుడు ఆలీఖాన్ వయసు కేవలం మూడేళ్లు. అంత పిన్న వయసులోనే ఇతనికి 'ఆరో అసఫ్ జా'గా బ్రిటీష్ ప్రభుత్వం నియమించింది. ఇతను 42 ఏళ్లు పాలించాడు. సాలార్‌జంగ్, అమీర్ ఏ కబీర్ (షమ్సల్ ఉమ్రా) ఇతనికి సంరక్షకులు.

పరిపాలనాదక్షుడైన మొదటి సాలార్‌జంగ్ తన పాలనా సంస్కరణల్ని అఫ్జలుద్దౌలా కాలంలో ప్రారంభించి ఈ అలీఖాన్ కాలంలో మరింత ముందుకు తీసుకెళ్లాడు. 1883, ఫిబ్రవరి 8న మొదటి సాలార్‌జంగ్ మరణంతో రాజ్యంలోని పరిస్థితులు అస్తవ్యస్థంగా తయారయ్యాయి. ముల్కీ ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది.

అంతలో మహబూబ్ ఆలీఖాన్‌కు 18 ఏళ్లు నిండటంతో 1884, ఫిబ్రవరి 5న బ్రిటీష్ వైస్రాయ్ లార్డ్ రిప్పన్ స్వయంగా వచ్చి నిజాంకు అధికారాన్ని అప్పగించాడు. అలా హైదరాబాద్ సంస్థానాన్ని సందర్శించిన మొదటి వైస్రాయిగా లార్డ్ రిప్పన్ చరిత్రలో నిలిచాడు. ఇదే రోజు సాయంత్రం మొదటి సాలార్‌జంగ్ కుమారుడైన మీర్ లాయిక్ ఆలీఖాన్ రెండో సాలార్‌జంగ్ బిరుదుతో దివాన్‌గా నియమితుడయ్యాడు.

మహబూబ్ ఆలీఖాన్ పాలనలో జరిగిన ప్రధాన సంఘటన – చాందా రైల్వే ఆందోళన. మహారాష్ట్రలోని చాందా నుంచి విజయవాడ వరకు రైలు మార్గం నిర్మించడానికి బ్రిటీష్ ప్రభుత్వం – హైదరాబాద్ పాలకుల మధ్య 1870లో ఒక ఒప్పందం కుదిరింది. ఈ రైల్వే నిర్మాణం వల్ల హైదరాబాద్ రాజ్యానికి నష్టమనే వదంతి వ్యాపించింది. దీంతో ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చెలరేగింది. దీనికి హైదరాబాద్ కాలేజీ ప్రిన్స్‌పాల్ అఘోరనాథ ఛటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ ఖయూమ్‌లు నాయకత్వం వహించారు. హైదరాబాద్‌లో ప్రజా చైతన్యానికి చాందా రైల్వే ఆందోళన నాంది పలికింది.

SAKSHI

1893లో మహబూబ్ ఆలీఖాన్ ప్రభుత్వం కనుంబా – ఇ – ముబారక్ అనే ఫర్మానా ద్వారా కొన్ని పాలనా సంస్కరణలు ప్రవేశపెట్టింది. ఫలితంగా ప్రభుత్వ యంత్రాంగంలో శాసనశాఖ, కార్యనిర్వాహక శాఖ, న్యాయ శాఖ అనే మూడు శాఖలు ఏర్పడ్డాయి.

**ఉస్మాన్ ఆలీఖాన్ :**

మహబూబ్ ఆలీఖాన్ కుమారుడు ఇతను. 37 ఏళ్లు పాలించాడు. ఈతని హయాంలో నైజాం రాజ్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. రైల్వే తపాలా శాఖలు పునర్నిర్మితమైనాయి. నిజాం స్టేట్ రైల్వే నెలకొంది. సిర్పూర్ పేపర్ మిల్స్, బోధన్ చక్కెర ఫ్యాక్టరీ, అజం జాహీ నూలు మిల్లులు, చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీ ఏర్పడ్డాయి. ఉస్మాన్ సాగర్ (గండిపేట చెరువు), నిజాం సాగర్, హిమాయత్ సాగర్ వంటి చెరువులు నిర్మితమైనాయి. ఈయన కాలంలోనే 1919, ఆగస్టు 28న ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపితమైంది.

అయితే ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరిగినప్పటికీ.. ఉస్మాన్ ఆలీఖాన్ కాలంలో హైదరాబాద్ రాజ్యాన్ని ముస్లిం రాజ్యంగా మార్చే ప్రయత్నం జరిగిందనే విమర్శ ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో మజ్లిస్–ఇత్తెహదుల్–ముస్లిమీన్ అనే ముస్లిం సంస్థ స్థాపితమైంది. ఇది హిందువులను ఇస్లామిక్ మతంలోకి మార్చే తబ్లిక్ కార్యక్రమం చేపట్టింది. ఎలగండల, పాలమూరు, ఇందూరు, మెతుకు సీమ వంటి పేర్లను 1905లో ప్రభుత్వం వరుసగా కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్‌లుగా మార్చింది. అలాగే మనుకోట, భువనగిరి వంటి పేర్లను మహబూబాబాద్, భోంగీర్‌లుగా మార్చింది. పాడు అనే మాటతో ఉండే పేర్లను పహాడ్‌గా మార్చివేశారు.

నిజాం నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా స్టేట్ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ప్రజా పోరాటాన్ని ప్రారంభించాయి. ఈ ప్రజా పోరాటాన్ని అణచి వేయడానికి నిజాం ముస్లిం మతోన్మాద సంస్థ ఇత్తెహదుల్ ముస్లిమీన్‌తో చేతులు కలిపాడు. ఈ సంస్థ నాయకుడు ఖాసిం రజ్వీ. ఈ సంస్థ కార్యకర్తలే రజాకార్లు.

1947లో భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత హైదరాబాద్ స్వతంత్ర రాజ్యంగా ఉండేందుకు ఉస్మాన్ ఆలీఖాన్ ప్రయత్నించాడు. అయితే, 1948, సెప్టెంబర్13న 'ఆపరేషన్ పోలో' అనే సైనిక చర్య జరిపి హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేయడం జరిగింది. అప్పటి నుంచి ఉస్మాన్ ఆలీఖాన్ రాజ్ ప్రముఖ్‌గా మారాడు. 1956లో ఆ పదవినీ కోల్పోయి, 1967, ఫిబ్రవరి 24న మరణించాడు.

SAKSHI

# ఆంధ్రప్రదేశ్ చరిత్ర అసఫ్ జాహీల వంశ పాలన

బహమనీ రాజ్యంలో అంతర్భాగంగా ఉన్న అప్పటి గోల్కొండ ప్రాంతానికి పరిపాలనా సౌలభ్యం కోసం... 'రెండో మహమ్మద్ బహమనీషా'... 'సుల్తాన్ కులీకుతుబ్‌షా'ని దక్కన్ ప్రాంతానికి సుబేదారుగా నియమించాడు. క్రీ.శ. 1518లో కులీకుతుబ్‌షా దక్కన్‌లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. తెలంగాణ ప్రాంతాన్ని క్రీ.శ.1687 వరకూ... సుమారు 170 ఏళ్లు కుతుబ్‌షాహీలు పాలించారు.

జనాభాలో అధిక సంఖ్యాకులు హిందువులయినప్పటికీ... కుతుబ్‌షాహీలు ఉదార స్వభావులుగా పేరుపొందారు. హిందువుల అభివృద్ధి, మతసామరస్యం, వాక్, రచనా స్వాతంత్ర్యాలు కల్పించడంలో కుతుబ్‌షాహీలు గొప్ప పరిపాలకులుగా గుర్తింపు పొందారు. ఇది మొగల్ చక్రవర్తి ఔరంగజేబుకు రుచించలేదు. చివరకు ఔరంగజేబు 1687లో గోల్కొండ రాజ్యాన్ని మొగల్ సామ్రాజ్యంలో విలీనం చేశాడు. దాంతో దక్కన్‌లో కుతుబ్‌షాహీల పాలన అంతమైంది.

## దక్కను పీఠభూమి:

కుతుబ్‌షాహీ.. అసఫ్‌జాహీ.. బహమనీ.. విజయనగర రాజుల కాలంలో... 'దక్కను పీఠభూమి' పేరు తరచుగా మనకు వినిపిస్తుంది. నర్మదా నదికి-వింధ్య పర్వతాలకు దక్షిణ భూభాగాన్ని 'దక్కను' అని అంటారు. ఇది ఎత్తైన ప్రదేశం. అందుకే దీనికి దక్కను పీఠభూమి అని పేరు వచ్చింది. ఇది తూర్పు, ఉత్తర దిక్కు నుంచి క్రమక్రమంగా ఎత్తుగా పెరుగుతూ.. పడమర, దక్షిణ దిశల్లో ఎత్తు తగ్గుతూ అంతరిస్తుంది. అందువల్ల దక్కన్ నదులు.. పడమర నుంచి తూర్పు దిశగా ప్రవహిస్తున్నాయి. గోల్కొండ రాజ్యంలో కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల పరిపాలనా కాలంలో దక్కన్ ప్రాంతం ప్రముఖ స్థానం సంపాదించుకుంది. క్రీ.శ. 1707లో ఔరంగజేబు మరణించాడు. రాజ్యం కోసం అంతఃకలహాలతో మొగల్ సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. సామంతులు, సుబేదార్లు, తరఫీదార్లు, గవర్నర్లు స్వతంత్ర అధిపతులయ్యారు. అందుకే చరిత్ర కారులు క్రీ.శ.1708 భారతదేశ చరిత్రలో పెద్ద మలుపు అన్నారు. దాదాపు 400 సంవత్సరాలు భారతదేశాన్ని పాలించిన మొగల్ వంశీయుల పతనం.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు జరుపుతున్న మహారాష్ట్రులు... విదేశీయుల పాలనలో మతోన్మాదుల దురాగతాల నుంచి విసుగు చెందిన భారత ప్రజానీకంలో విప్లవ బీజాలు నాటుకోవడం.. అవి కార్యరూపం దాల్చడం మొదలైన ఎన్నో పరిణామాలు సంభవించాయి.

## మొదటి అసఫ్‌జా (క్రీ.శ. 1724-1748):

దక్షిణ భారతదేశం, దక్కన్ పీఠభూమిలో సుమారు 83,000 చదరపు మైళ్ల విస్తీర్ణంలో... సుమారు 200 ఏళ్లపాటు చరిత్రలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్ రాజ్యాన్నే 'నిజాం రాజ్యం' అని పిలుస్తారు. ఈ రాజ్యానికి మూలపురుషుడు 'చిన్ కిలిచ్ ఖాన్'. ఇతనికి 'నవాబ్ నిజాం ఉల్‌ముల్క్' అనే బిరుదు ఉంది. మొగల్ చక్రవర్తి 'ఫరూక్ సీర్' 1713లో ఈ బిరుదు ఇచ్చాడు. 1724లో నిజాం నవాబు ఉల్‌ముల్క్ దక్కన్ ప్రాంతానికి సుబేదారుగా లేదా వైస్రాయ్‌గా నియమితుడయ్యాడు. అదే సంవత్సరంలో స్వతంత్రుడయ్యాడు. ఇతన్నే 'మీర్ క్రముద్దీన్ ఖాన్' అని కూడా పిలుస్తారు. ఇతనికి ఫతేజంగ్, అసఫ్‌జా వంటి బిరుదులున్నాయి. 'నిజాం' అంటే... 'రెగ్యులేటర్ ఆఫ్ ద స్టేట్' అని అర్థం. చిన్ కిలిచ్ ఖాన్ పూర్వీకులు సమర్‌ఖండ్‌లోని బుఖార రాజ్యంలో ఆలియాబాదుకు చెందినవారు.

'నిజాం ఉల్-ముల్క్ అసఫ్‌జా' పరిపాలన కాలంలో... కర్ణాటక, కడప, కర్నూలు నవాబులు ఇతనికి సామంతులుగా ఉన్నారు. అసఫ్‌జా ఈ పెత్తనాన్ని, ఆధిపత్యాన్ని దీర్ఘకాలం నిలుపుకోలేకపోయాడు. పశ్చిమాన, ఉత్తరాన మహారాష్ట్రులు, మైసూరు సుల్తానులు ఎదురు తిరిగారు. మైసూరు సుల్తాన్.. కడప, కర్నూలు ప్రాంతాలను ఆక్రమించాడు. మహారాష్ట్రులు ఉత్తర కర్ణాటక ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అయినప్పటికీ మొదటి అసఫ్‌జా తన రాజ్యాన్ని శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకూ.. మైసూరు నుంచి తిరుచునాపల్లి వరకూ విస్తరించాడు. 1729లో మహారాష్ట్ర-మరాఠాల నుంచి సర్దేశ్ ముఖ్-చౌత్ సుంకాలను వసూలు చేశాడు.('సర్దేశ్ ముఖ్' అంటే.. ఆదాయంలో పదింట ఒక భాగం పన్ను వసూలు చేయడం.) అప్పటి నుంచి మహారాష్ట్రులు నిజాంతో విభేదించారు. అసఫ్‌జా తన సుబా నంతటినీ మూడు భాగాలుగా విభజించాడు. అవి : సర్ఫ్‌ఖాస్, దివానీ, జాగీరులు. అందులో సర్ఫ్‌ఖాస్ భూములను తనకూ, తన వంశస్థులు, కుటుంబీకులకు ప్రత్యేక ఖర్చుల కోసం వినియోగించాడు. ఉత్తర హిందూస్థాన్ నుంచి తనతో వచ్చిన హిందూ-ముసల్మాన్ ఉద్యోగుల సహాయంతో రాజ్యాంగ సైనిక ఏర్పాట్లు చేశాడు. వారికి ప్రతిఫలంగా జాగీరులు, మున్సబులు ఇప్పించాడు.

## నాదిర్షా దండయాత్ర:

క్రీ.శ.1737లో అసఫ్‌జాని తిరిగి ఢిల్లీకి ఆహ్వానించారు. ఆగ్రా, మాల్వా ప్రాంతాలకు సుబేదారుగా నియమితుడయ్యాడు. 1738లో 'నాదిర్షా' ఢిల్లీపై దండయాత్ర చేశాడు. ఆ సమయంలో అసఫ్‌జా... నాదిర్షా, ఢిల్లీ సుల్తానుల మధ్య సంధి కుదిర్చాడు. అసఫ్‌జా రాజనీతికి నాదిర్షా మెచ్చుకుని... 'అమీర్-ఉల్-ఉ మ్రాన్' అనే బిరుదు ప్రదానం చేశా

SAKSHI

డు. అసఫ్‌జా ఢిల్లీలో ఉన్న సమయంలో అతని కొడుకు నసీరు జంగ్ దక్కన్‌కు సర్వస్వతంత్రుడుగా ప్రకటించుకున్నాడు. ఈ కుట్రను తెలుసుకున్న అసఫ్‌జా ఢిల్లీ నుంచి దక్కన్ చేరుకొని.. 1741లో నసీర్ జంగ్‌తో పోరాడాల్సి వచ్చింది. ఆ పోరులో నసీరుజంగ్ ఓడిపోయాడు. నాందేడ్ వద్ద కాంధోర్ కోటలో అతను బంధీ అయ్యాడు.

మొదటి నిజాం అసఫ్‌జా మరణానంతరం... రాజ్యాధికారం కోసం కుమారుడు నసీర్‌జంగ్, మే నల్లుడు ముజఫర్‌జంగ్‌ల మధ్య పోరాటం జరిగింది. ఫ్రెంచివారు ముజఫరుజంగును, కర్ణాటకలో చందా సాహెబులకు తమ మద్దతు ప్రకటించారు. ఆంగ్లేయులు నవాబు నసీరుజంగ్, నవాబు అన్వరుద్దీలను సమర్థించారు. ఆంగ్లేయులు, ఫ్రెంచివారు భారతదేశంలోని రాజ్యాల విషయంలో జోక్యం చేసుకోవడం ఇది మొదటిసారి. ఈ పోరాటంలో తుదకు ముజఫర్ జంగ్.. ఫ్రెంచి కమాండర్ డ్యూపెక్స్ సహాయంతో రాజ్యాధికారం కైవసం చేసుకున్నాడు. వీరి తర్వాత రాజ్యాధికార పోరాటం... మొదటి అసఫ్‌జా కుమారులైన జియుద్దీఖాన్, సలాబత్‌జంగ్‌ల మధ్య పోరాటం జరిగింది. సలాబత్‌జంగ్ రాజ్యాధికారం చేజిక్కించుకున్నాడు. అయితే ఇతడి పాలన ఎంతో కాలం కొనసాగలేదు. అతని చిన్న తమ్ముడు నిజాం అలీఖాన్... 1761లో సలాబత్‌జంగ్‌ని తొలగించాడు. హైదరాబాద్ దక్కన్ ప్రాంతానికి నిజాం అలీఖాన్ సుల్తాన్‌గా వచ్చాడు. సలాబత్‌జంగ్‌కు ఫ్రెంచివారు సహాయపడ్డారు. ప్రతిఫలంగా ఫ్రెంచివారికి ఉత్తర సర్కారు ప్రాంతాలను ఫ్రెంచి బుస్సీ సైన్యం ఖర్చుల కోసం దారాదత్తం చేశాడు. మచిలీపట్టణానికి ఉత్తరాన-దక్షిణ దిశలో ఉండే ప్రాంతాల్ని ఉత్తర సర్కారులంటారు.

## రెండో అసఫ్ జా:

హైదరాబాద్-దక్కన్ ప్రాంతానికి రెండో అసఫ్‌జాగా నిజాం అలీ ఖాన్ గుర్తింపు పొందాడు. నిజాం అలీఖాన్.. పరిపాలనా సౌలభ్యం కోసం రాజధానిని ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్‌కు మార్చాడు. అప్పటి నుంచి హైదరాబాద్ అసఫ్‌జాహీలకు ప్రధాన రాజధానిగా ఉంటూ వచ్చింది. మొదటి అసఫ్‌జా కిన్ కిలిచ్‌ఖాన్ తర్వాత నాజర్‌జంగ్ లేదా(నసీర్‌జంగ్) ముజఫర్‌జంగ్, సలాబత్ జంగ్‌ల మధ్య జరిగిన రాజ్యాధికార పోరాటంలో... సుమారు 14 సంవత్సరాల పాటు దక్కన్ సుబేదార్లుగానే గుర్తింపు పొందారు. మొగల్ పాలకులు... ఈ ముగ్గురికీ అసఫ్‌జా లేదా 'నిజాం' బిరుదులను ఇవ్వలేదు. అందువల్ల వారు చరిత్రలో 'నిజాం'లుగా గుర్తింపు పొందలేదు. రెం డో అసఫ్‌జా, నిజాం అలీఖానే... 'నిజాం'గా గుర్తింపు పొందాడు. పై ముగ్గురూ 'నిజాం'లుగా గుర్తింపు పొందితే... నిజాం అలీఖాన్ ఐదో నిజాం అయ్యేవాడు.

## ప్రాక్టీస్ ప్రశ్నలు

**1.సుల్తాన్ 'కులీకుతుబ్‌షా' దక్కన్ ప్రాంతానికి సుబేదారుగా ఏ బహమనీ సుల్తాన్ కాలంలో నియమితుడయ్యాడు?**

ఎ) అల్లాఉద్దీన్ హసన్ మహమ్మద్ షా

బి) మహ్మద్ షా

సి) తాజుద్దీన్ ఫిరోజ్ షా

డి) రెండో మహమ్మద్ బహమనీ షా

**2.తెలంగాణ ప్రాంతాన్ని కుతుబ్‌షాహీలు ఎన్ని సంవత్సరాలు పరిపాలించారు?**

ఎ) 150 సంవత్సరాలు  బి) 160 సంవత్సరాలు

సి) 100 సంవత్సరాలు  డి) 170 సంవత్సరాలు

**3. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు గోల్కొండ రాజ్యాన్ని ఏ సంవత్సరంలో విలీనం చేశాడు?**

ఎ) 1687లో  బి) 1656లో

సి) 1653లో  డి) 1680లో

**4.అసఫ్‌జాహీల వంశ స్థాపకుడెవరు?**

ఎ) నిజాం అలీఖాన్  బి) ఫరూక్‌సీర్

సి) చిన్ కిలిచ్ ఖాన్  డి) మహబూబ్ అలీ పాషా

**5.నిజాం అంటే అర్థం ఏమిటి?**

ఎ) జాగీరుదారు  బి) పట్వారీ

సి) దేశ్‌ముఖ్  డి) రెగ్యులేటర్ ఆఫ్ ద స్టేట్

**6.నిజాం ఉల్ ముల్క్ చిన్ కిలిచ్ ఖాన్ దక్కన్ ప్రాంతానికి ఎక్కడి నుంచి వలస వచ్చారు?**

ఎ) సమర్‌ఖండ్  బి) హందమ్

సి) ఇరాన్  డి) పర్షియా

**7.'మీర్ కమ్రుద్దీన్ ఖాన్' అని ఇతన్ని పిలుస్తారు?**

ఎ) రెండో అసఫ్‌జా  బి) నసీరుద్దౌలా

సి) మీర్ ఉస్మాన్ అలీఖాన్

డి) నవాబ్ నిజాం ఉల్‌ముల్క్

**8.కింది వాటిలో 'చిన్ కిలిచ్ ఖాన్' బిరుదులు ఏవి?**

ఎ) నిజాం ఉల్‌ముల్క్  బి) ఫతేజంగ్

సి) అసఫ్‌జా  డి) పైవన్నీ

**9.'నవాబ్ నిజాం ఉల్‌ముల్క్' అనే బిరుదును నిజాంకు ఎవరు ప్రదానం చేశారు?**

ఎ) ఫరూక్ సీర్  బి) బహదూర్ షా

సి) అహ్మద్ షా  డి) మహమ్మద్ షా

**10. నిజాం ఉల్‌ముల్క్ పరిపాలనా కాలం ఏది?**

ఎ) 1724-1744  బి) 1724-1748

సి) 1724-1750  డి) ఏదీ కాదు

| జవాబులు | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | D | D | A | C | D | A | D | D | A | B |

SAKSHI

## నవాబు అఫ్జల్ ఉద్దౌలా (క్రీ.శ.1857–1869)

నాలుగో అసఫ్‌జా నాసీరుద్దౌలా అనంతరం అతని పెద్ద కుమారుడు 'అఫ్జల్ ఉద్దౌలా' రాజ్యాన్ని అధిష్టించాడు. ఈ కాలంలోనే 1857లో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఉత్తరభారతదేశం అంతా తిరుగుబాట్లతో అల్లకల్లోలంగా ఉంది. మీరట్, ఢిల్లీ, ఝాన్సీ.. ప్రతిచోట ఉద్యమాలు వచ్చాయి. ఆంగ్లేయులు ముస్లింలకు వ్యతిరేకులని, మౌల్వీ అల్లాఉద్దీన్, మౌల్వీ ఇబ్రహీం అనే మత నాయకులు హైదరాబాద్ మక్కా మసీదులో సమావేశం జరిపి, ఆంగ్లేయులపై జీహాద్ ప్రకటించారు. అనేక అల్లర్లు సృష్టించారు. నవాబ్ అఫ్జల్ ఉద్దౌలా అతని ప్రధానమంత్రి సాలార్‌జంగ్ లు ఈ అల్లర్లను అణచి వేశారు. సాలార్‌జంగ్ హైదరాబాద్ సంస్థానంలో 1857 నాటి తిరుగుబాట్లను కఠినంగా అణచివేసి, ఆంగ్లేయులకు తోడ్పడ్డాడు. 1857 జూలై 17న 'రొహిల్లాలు' హైదరాబాద్ రెసిడెన్సీపై దాడి చేశారు. దాన్ని సాలార్‌జంగ్ అణచివేశాడు.

అఫ్జల్ ఉద్దౌలా కాలంలో హైదరాబాద్ మింట్‌లో నాణేలు ముద్రించారు. ఆ నాణేలపై గతంలో ఉన్న బహదూర్ షా (ఢిల్లీ చక్రవర్తి) పేరు స్థానంలో 'నిజాం ఉల్ ముల్క్–అసఫ్ జా బహద్దూర్' అని ఒక వైపున, మరో వైపున హైదరాబాద్ మింట్‌లో ముద్రిస్తున్నట్లు అచ్చు వేశారు. వాటిని 'హాలిసిక్కా నాణేలుగా' వ్యవహరించేవారు.

అఫ్జల్ ఉద్దౌలా 1860లో హైదరాబాద్ రాష్ట్రం నుంచి రాయచూర్ మార్గంలో వెళ్లే బొంబాయి–మద్రాసు రైల్వే మార్గానికి భూమిని ఇచ్చాడు. ఆ తర్వాత దాన్ని 'వాడీ' వరకు విస్తరించాడు.

ఈయన కాలంలోనే 'ప్రభుత్వ కేంద్ర ఖజానా', 'స్టాంపు పేపర్' కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ స్థలాన్ని రాజాబాలకృష్ణ దగ్గర నుంచి సేకరించి అభివృద్ధి చేశాడు. నగర పరిధిలో 'మద్యం' విక్రయించే దుకాణాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. అఫ్జల్‌గంజ్ బజార్, అఫ్జల్ వంతెన, అఫ్జల్‌గంజ్ మసీదు ఈయనే నిర్మించాడు. ఈయన కాలంలోనే హైదరాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటయింది. ఈయన 1869లో మరణించాడు.

## నవాబ్ మీర్ మహబూబ్ అలీఖాన్ (క్రీ.శ. 1869–1911) :

అఫ్జల్ ఉద్దౌలా మరణానంతరం 'మహబూబ్ అలీఖాన్' మూడేళ్ల వయస్సులోనే రాజయ్యాడు. ఈ సమయంలో మొదటి సాలార్ జంగ్ ప్రధానమంత్రిగా, మహబూబ్‌కు 'పోషకుడు'గా ఉంటూ అనేక సంస్కరణలు చేపట్టాడు. మహబూబ్ అలీ కాలంలోనే 'వైశ్రాయ్ రిప్పన్' హైదరాబాద్ వచ్చాడు. నిజాం రాజ్యానికి వచ్చిన ప్రథమ వైశ్రాయ్ ఇతడు. మొదటి సాలార్‌జంగ్ మరణించిన తర్వాత ఇతనికి ప్రధానమంత్రులుగా సర్ అస్మాన్‌జా, సర్ వికార్–ఉల్–ఉమ్రా, మీర్ లాయక్ అలీఖాన్, మహారాజా కిషన్ ప్రసాద్‌లు పనిచేశారు. మహబూబ్ అలీ బ్రిటిషువారికి సహాయంగా మంచి శిక్షణ పొందిన సైన్యం –'ఇంపీరియల్ ట్రూప్స్' ఏర్పాటు చేశాడు. మహబూబ్ అలీ కాలంలోనే ఐదవ జార్జి చక్రవర్తి (ప్రిన్స్ ఆఫ్ వేల్స్) హైదరాబాద్ సందర్శించాడు. ఆయన రాకకు స్మారక చిహ్నంగా ఒక జనానా వైద్యశాల, వైద్యవిద్య పాఠశాల స్థాపించాడు. ఈయన కాలంలోనే ఉన్నత న్యాయస్థానం, 'దారుల్ ఉలూం' పాఠశాలలు నెలకొల్పాడు. ప్రభుత్వాన్ని ఉత్తమ పద్ధతుల్లో నడపడానికి 'క్యాబినెట్ కౌన్సిల్' (అంతరంగ సభ) ఏర్పాటుచేశాడు. ప్రస్తుత మహబూబ్ కాలేజీ, అలియా కాలేజీలు ఈయన కాలంలోనే ఏర్పాటయ్యాయి.

1884లో మీర్ లాయక్ అలీఖాన్ ప్రధానిగా నియమితుడయ్యాడు. ఇతడు మొదటి సాలార్‌జంగ్ ప్రవేశపెట్టిన సంస్కరణలన్నింటినీ అమలు చేశాడు. మహబూబ్ అలీపాషా పత్తిరైతుల దుస్థితిని గమనించి, హైదరాబాద్, గుల్బర్గా, ఔరంగాబాద్‌లలో పత్తి మిల్లులు నెలకొల్పాడు. నిస్సార భూములకు సాగునీటిని సరఫరా చేయడానికి చెరువులు మరమ్మత్తులు చేయించాడు. శాస్త్రీయ పద్ధతిలో వైద్యవిద్య, చికిత్సకు ప్రాధాన్యతనిచ్చాడు. ఈయన కాలంలోనే 1897లో 'సర్ రోనాల్డ్ రాస్' బేగంపేటలో మలేరియా సూక్ష్మజీవులను కనుగొన్నాడు. 1891లో మహబూబ్ అలీపాషా అరబిక్–పర్షియా రాతప్రతులు సేకరించి, 'అసఫియా రాష్ట్ర గ్రంథాలయం' స్థాపించాడు. అదే ప్రస్తుత ఇమ్లిబన్ బస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న సెంట్రల్ లైబ్రరీ. మలక్‌పేట్‌లో 'గుర్రపు పందాలు' ఏర్పాటు చేశాడు. ప్రస్తుత 'అసెంబ్లీ హాలు'కు నాటి పబ్లిక్ గార్డెన్‌లో మహబూబ్ అలీపాషా తన 40వ జన్మదిన సందర్భంగా శంకుస్థాపన చేశాడు. ఈ హాలును అప్పట్లో 'టౌను హాలు'గా పిలిచేవారు. సరూర్‌నగర్‌లో 'విక్టోరియా స్మారక అనాథ శరణాలయాన్ని' ఏర్పాటు చేశాడు. 1908లో మూసీ నదికి వరదలు వస్తే, మూడు నెలలు పాటు 'ఫలక్‌నుమా' ప్యాలస్‌లో ప్రజల కోసం

SAKSHI

పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాడు. ఈయన పేరు మీదే వరంగల్ జిల్లాలోని 'మానుకోటకు' 'మహబూబాబాద్' అని, పాలమూరుకు మహబూబ్‌నగర్ అని పేర్లు మార్చారు. 1895లో మొట్టమొదటి టెలిఫోను సౌకర్యం కల్పించాడు. మహబూబ్ అలీపాషా మానవతావాదిగా పేరు ప్రఖ్యాతులు గడించాడు. ఇతడు 1911లో మరణించాడు.

**మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-1948):** అసఫ్ జాహీల వంశంలో ఏడవ నవాబ్ 'మీర్ ఉస్మాన్ అలీఖాన్' హైదరాబాద్ సంస్థానాన్ని 1911 నుంచి 1948 వరకు పాలించాడు. 1948 నుంచి 1956 వరకు ఉస్మాన్ పాత హైదరాబాద్ రాష్ట్రానికి 'రాజప్రముఖ్'గా వ్యవహరించాడు. హైదరాబాద్ రాష్ట్రాన్ని పాకిస్తాన్‌కు అప్పగించాలనే యోచనతో, రాష్ట్రాన్ని 'ఇస్లాం స్టేటు'గా మార్చాలనే తపనతో స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకోవాలని ఈయన భావించాడు. 'ఇత్తే హాదుల్ ముసల్మీన్' అనే మతసంస్థ అధ్యక్షుడు బహదూర్ యార్‌జంగ్ ముస్లింలే పాలకులని, నిజాం వారి ప్రతినిధి మాత్రమేనని ప్రచారం చేశాడు. దీనితో నిజాం మండిపడి, బహదూర్ యార్‌జంగ్‌ని అధ్యక్ష పదవి నుంచి తప్పించి, అబిద్ హసన్ సయీద్ అలీని, ఇత్తేహాదుల్ ముసల్మీన్ అధ్యక్షునిగా చేశాడు. ఇతని తర్వాత ఖాసిం రజ్వీ ఈ సంస్థకు అధ్యక్షుడయ్యాడు. హైదరాబాద్ సంస్థానానికి నిజాం నవాబే సార్వభౌమాధికారి అని రజ్వీ ప్రకటించాడు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో గాని, పాకిస్థాన్‌లో గాని చేరబోదని స్వతంత్రంగా ఉంటుందని ఫర్మానా జారీచేశారు. భారతదేశ సమగ్రతకు భంగం వాటిల్లే చర్యలకు నిజాం నవాబ్ ఉస్మాన్ అలీఖాన్ పాల్పడ్డాడు. ఈ పరిస్థితులలో 1948 సెప్టెంబరు 13న భారత సైన్యం నిజాం సంస్థానం మీద 'పోలీసు చర్య'కు నిర్ణయించింది. జనరల్ జె.ఎన్. చౌదరి నాయకత్వంలో భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానానికి సైన్యాన్ని తరలించింది. 1948 సెప్టెంబరు 17న నిజాం నవాబ్ ఉస్మాన్ అలీఖాన్ లొంగిపోవడంతో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయింది. దీంతో దక్కనులో అసఫ్ జాహీల వంశపాలన అంతం అయింది.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ 'సిటీ ఇంప్రూవ్‌మెంట్స్ బోర్డు' ప్రారంభించారు. హైదరాబాద్ నగరానికి మంచినీటి సదుపాయం కోసం గండిపేట గ్రామం వద్ద 'ఉస్మాన్ సాగర్ చెరువు' మూసీనదిపై నిర్మాణా నికి పథకం రూపొందించి, దానిని 1920లో నిర్మించాడు. 1927లో 'హిమాయత్‌సాగర్' నిర్మించాడు. 1928లో హైదరాబాదు-బెంగళూరుల మధ్య మీటర్‌గేజ్ రైల్వేమార్గం ఏర్పాటు చేశాడు. 1923 నాటికే విద్యుత్, నీటి సదుపాయం, టెలిఫోను సౌకర్యాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చాడు. ఉస్మాన్ అలీఖాన్ అనేక ప్రజోపకార్యాలు చేపట్టాడు. ఉస్మానియా యూనివర్సిటీ, ఉస్మానియా హాస్పిటల్, పోచంపల్లి ప్రాజెక్ట్ సహా 14 ప్రాజెక్టులు ఈయన కాలంలోనే ఏర్పాటయ్యాయి. ఉస్మాన్ అలీఖాన్ ఔరంగాబాద్‌లోని అజంతా, ఎల్లోరా గుహలకు రహదారులు ఏర్పాటు చేశాడు. ఇటలీ నుంచి కళాకారులను రప్పించి అజంతా, ఎల్లోరాలోని చిత్రకళను పెయింటింగ్‌ల రూపంలోకి మార్చాడు. పురావస్తు శాఖ మ్యూజియంలో ఈ పెయింటింగ్‌లు నేటికీ భద్రంగా ఉన్నాయి. ఆరాయత్ బల్దా పేరుతో ఈయన నిర్మించిన భవనమే నేటి బల్దియా. తామీరాత్ ఆమా పేరుతో పీడబ్ల్యూడీ వ్యవస్థ, ఆబ్‌పాషీ పేరుతో ఇరిగేషన్ వ్యవస్థ ఈయన కాలంలో రూపుదిద్దుకున్నవే. పాఠశాలలు, వైద్యశాలలు, సర్కారీ కచేరీల కోసం అనేక భవనాలు నిర్మించాడు. వివిధ దేవాలయాలు, చర్చిలు, గురుద్వారాల నిర్మాణానికి సహాయం అందించాడు. జాగీర్దారులను ఏర్పాటు చేశాడు. ఉస్మాన్ అలీఖాన్ అధికారం చేపట్టి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బాగేఆమ్ (పబ్లిక్ గార్డెన్స్)లో నిర్మించిన జూబ్లీహాలే ప్రస్తుత విధాన సభ భవనం.

## ప్రాక్టీస్ ప్రశ్నలు

**1. హైదరాబాద్ రాష్ట్రానికొచ్చిన మొట్టమొదటి బ్రిటిష్ వైశ్రాయ్ ఎవరు?**

ఎ) లార్డ్ రిప్పన్ బి) వారన్ హేస్టింగ్స్
సి) లార్డ్ డల్హౌసీ డి) లార్డ్ బెంటిక్

**2. ఆంగ్లేయులకోసం మంచి శిక్షణ పొందిన 'ఇంపీరి యల్ ట్రూప్స్' అనే సైనిక దళాన్ని ఏ నిజాం ఏర్పాటు చేశాడు?**

ఎ) మీర్ ఉస్మాన్ అలీఖాన్ బి) మహబూబ్ అలీపాషా
సి) నాసీరుద్దౌలా డి) నిజాం అలీఖాన్

**3. 'అసఫియా రాష్ట్ర గ్రంథాలయాన్ని' హైదరాబాద్‌లో 'మీర్ మహబూబ్ అలీఖాన్' ఏ సంవత్సరంలో స్థాపించాడు?**

ఎ) 1800 బి) 1890 సి) 1824 డి) 1891

**4. విక్టోరియా స్మారక అనాథ శరణాలయాన్ని 'మహబూబ్ అలీపాషా' ఎక్కడ నిర్మించాడు?**

ఎ) మహబూబ్‌నగర్‌లో బి) మానుకొండలో
సి) నిజామాబాద్
డి) హైదరాబాద్ (సరూర్‌నగర్‌లో)

**5. మహబూబ్ నగర్ అసలు పేరు ఏమిటి?**

ఎ) పాలమూరు బి) ఆలమూరు
సి) మహబూబాబాద్ డి) ఏదీ కాదు

**6. 'ఇత్తేహాదుల్ ముసల్మీన్' అనే మతసంస్థకు ప్రథమ అధ్యక్షుడెవరు?**

ఎ) కాశీం రజ్వీ బి) అబీద్ హసన్

SAKSHI

సి) బహదూర్ యార్‌జంగ్ డి) సయ్యద్ అలీ

7. 'హైదరాబాద్ సంస్థానం' భారతదేశంలో ఏ సంవత్సరంలో విలీనం అయింది?

ఎ) 1948 బి) 1940 సి) 1947 డి) 1942

8. ఏ నిజాం కాలంలో ఐదవ జార్జి చక్రవర్తి (ప్రిన్స్ ఆఫ్ వేల్స్) హైదరాబాద్‌ను సందర్శించాడు?

ఎ) నిజాం సికిందర్ జా బి) నిజాం నాసీరుద్దౌలా

సి) నిజాం మహబూబ్ అలీపాషా

డి) నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్

9. ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడపడానికి 'క్యాబినెట్ కౌన్సిల్' (అంతరంగ సభ)ను ఏర్పాటు చేసిన నిజాం నవాబ్ ఎవరు?

ఎ) మీర్ ఉస్మాన్ అలీఖాన్ బి) మహబూబ్ అలీపాషా

సి) నిజాం అలీఖాన్ డి) అఫ్జల్ ఉద్దౌలా

10. హైదరాబాద్ బ్రిటిషు రెసిడెన్సీపై ఏ సంవత్సరంలో 'రొహిల్లాలు' దాడి చేశారు?

ఎ) 1850 బి) 1857 సి) 1854 డి) 1848

11. హైదరాబాద్ నగర పరిధిలో మద్యం విక్రయించే దుకాణాలను నిషేధించిన నిజాం ఎవరు?

ఎ) అఫ్జల్ ఉద్దౌలా బి) నాసీరుద్దౌలా

సి) సికిందర్ జా డి) నిజాం అలీఖాన్

**జవాబులు**

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
|---|---|---|---|---|---|---|---|---|---|
| A | B | D | D | A | C | A | C | B | B |

SAKSHI